సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

బుధవారం, 28, మే, 2025



..మరమ్మతులు సున్నా

తాలిపేరు ప్రధాన కాల్వల మరమ్మతులకు నిధులు మంజూరైనా మరమ్మతు పనులకు పట్టిన గ్రహణం వీడడం లేదు. 8లో



తీర్థయాత్రలకు వెళ్తారా..?

తీర్థయాత్రలకు వెళ్లే వారి సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ అధికారి కిశోర్ వెల్లడించారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 26°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు, రేపు మంత్రి సీతక్క పర్యటన

చుంచుపల్లి: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క బుధ, గురువారాల్లో కొత్తగూడెం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. బుధవారం మధ్యాహ్నం 2.45 నిమిషాలకు కొత్తగూడెం చేరుకుని ఐడీఓసీలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు. అనంతరం సింగరేణి గెస్ట్‌హౌస్‌లో రాత్రి బస చేస్తారు. గురువారం ఉదయం కొత్తగూడెం క్లబ్‌లో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి 200 మంది బాలికలకు ఇందిరమ్మ అమృత కిట్లను పంపిణీ చేస్తారు. అనంతరం పాల్వంచ మండలం కిన్నెరసానిలో పలు కార్యక్రమాల్లో పాల్గొంటారు. సాయంత్రం 4 గంటలకు అక్కడి నుంచి ములుగుకు బయలు దేరి వెళతారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

బూర్గంపాడు: బూర్గంపాడు ఐకేపీలో స్త్రీనిధి నిధుల దుర్వినియోగంపై మంగళవారం ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. డ్వాక్రా సంఘాల మహిళలు తీసుకున్న స్త్రీనిధి రుణాల చెల్లింపుల్లో ఐకేపీ సిబ్బంది అక్రమాలకు పాల్పడ్డారని మహిళలు ఇటీవల ఐకేపీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. తాము తీసుకున్న స్త్రీనిధి రుణాల వాయిదాలను క్రమం తప్పకుండా చెల్లించిన ఐకేపీసిబ్బంది వాటిని తమ రుణ ఖాతాల్లో జమ చేయకుండా సొంత అవసరాలకు వాడుకున్నారని మహిళలు ఆరోపించారు. మహిళల ఆరోపణలు, ఆందోళనలతో స్త్రీనిధి ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణకు ఆదేశించడంతో మంగళవారం విచారణ చేపట్టారు. మరో మూడురోజుల పాటు ఈ విచారణ కొనసాగనుంది. స్త్రీనిధి ఆర్‌ఎం శ్రీనివాస్, అసిస్టెంట్ మేనేజర్ యాసిన్, ఐకేపీ ఏపీఎం నాగార్జున, ఐకేపీ సిబ్బంది విచారణలో పాల్గొన్నారు.

1 నుంచి క్రీడా అకాడమీల్లో ఎంపికలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాట్స్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా అకాడమీల్లో ఎంపికలకు ఆసక్తి గల బాలబాలికలు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన, క్రీడలశాఖ అధికారి పరంధామరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జూన్ 1నుంచి 13వ తేదీ వరకు జరిగే అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్, సైక్లింగ్, హాకీ, హ్యాండ్‌బాల్, స్విమ్మింగ్, వాలీబాల్ తదితర క్రీడాంశాల్లో ఎంపికలకు హాజరుకావాలని సూచించారు. విద్యార్థులు స్టడీ సర్టిఫికెట్లు, వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో పాటు పది పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకుని రావాలని తెలిపారు.

ఉప్పొంగి‘నది’!



అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలోని దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరి మంగళవారం ఉప్పొంగి ప్రవహించింది. గత నెలలో ఆనకట్ట వద్ద నీటి మట్టం గణనీయంగా తగ్గి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, పరిశ్రమలకు నీటి సరఫరాలో ఇబ్బంది ఎదురయ్యే అవకాశం ఏర్పడింది. దీంతో కలెక్టర్, ఇరిగేషన్, మిషన్ భగీరథ అధికారులు చర్చించి ఏప్రిల్, మే నెలల్లో నీటి సమస్య రాకుండా గతనెల 14న తుపాకులగూడెంలో సమ్మక్క – సారక్క బ్యారేజీ నుంచి నీరు విడుదల చేయించారు. కాగా, 45 రోజుల నుంచి నీరు వస్తుండడానికి తోడు ఇటీవల వర్షాలు కురుస్తుండడంతో ఆనకట్ట వద్ద నీరు ఉప్పొంగుతోంది.

– అశ్వాపురం

బెల్ట్ X సిండికేట్





మద్యం చీకటి వ్యాపారంలో జోడెద్దుల్లా నడిచిన సిండికేట్, బెల్ట్‌షాపు నిర్వాహకుల మధ్య నెల కొన్న విబేధాలు రచ్చకెక్కుతున్నాయి. అమ్మకాల కష్టం తమదైతే లాభాల్లో సింహభాగం సిండికేట్ ఖజానాలోకే పోతోందని బెల్ట్‌షాప్ నిర్వాహకులు అనుమానించడమే ఇందుకు కారణం. ఇల్లెందులో ఎక్సైజ్ శాఖ దాడి చేయగా రూ.3.70 లక్షల విలువైన మద్యం సీసాలు పట్టుబడడంతో ఈ వ్యవహారం వెలుగుచూసింది.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

ఇష్టారీతిగా మద్యం ధర పెంచుతున్న వ్యాపారులు

- ప్రత్యామ్నాయ మార్గాలు వెదుక్కుంటున్న బెల్ట్‌షాప్ నిర్వాహకులు
- వారికి మద్యం సరఫరాపై కన్నెర్ర చేస్తున్న సిండికేట్
- ఇల్లెందు ఘటనతో వెలుగుచూసిన వైరం

రేటు పెంచిన సిండికేటు..

లైసెన్స్ పొందిన వైన్ షాపుల్లో ప్రభుత్వం నిర్ణయించిన ధరకే మద్యాన్ని అమ్మాల్సి ఉంటుంది. అయితే ఎమ్మార్పీకి అమ్మితే లాభాలు పెద్దగా రావనే ఉద్దేశంతో మద్యం వ్యాపారులంతా సిండికేట్‌గా ఏర్పడి, వైన్స్‌లలో పాపులర్ మద్యం బ్రాండ్లు అందుబాటులో లేకుండా చూస్తారు. డిమాండ్ ఎక్కువగా ఉన్న మద్యాన్ని బెల్ట్‌షాపుల ద్వారా అధిక ధరలకు అమ్ముతుంటారు. క్వార్టర్ బాటిల్‌పై ఎమ్మార్పీ ధర కంటే రూ.20 ఎక్కువకు బెల్ట్‌షాప్‌లకు విక్రయిస్తే వారు మరో రూ.20 కలిపి ఎమ్మార్పీకంటే రూ.40 అదనంగా అమ్ముతుంటారు. జిల్లాలోని అనేక పట్టణాల్లో ఈ దందా చాలా రోజులుగా కొనసాగుతోంది. అయితే ఇల్లెందు, పాల్వంచ, మణుగూరు పట్టణాల్లో సిండికేట్ నిర్వాహకులు తమ లాభాలను మరింతంగా పెంచుకునేందుకు ఎమ్మార్పీపై రూ.30 వరకు అదనంగా అమ్మడం మొదలుపెట్టారు.

బయట నుంచి మద్యం..

సాధారణంగా పట్టణాలు, పెద్ద మండల కేంద్రాల్లో మద్యం నిర్వాహకులు సిండికేట్‌గా ఏర్పడుతుంటారు. వీరి పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో మద్యం అమ్మకాలపై వారిదే గుత్తాధిపత్యం నడుస్తోంది. సిండికేట్ చెప్పిన ధరకు మద్యం కొనుగోలు చేయడంతో కష్టం తమది.. లాభం వారికి పోతోందని భావించిన బెల్ట్‌షాపు నిర్వాహకుల్లో కొందరు ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించారు. సిండికేట్ లేని పట్టణాల్లోని వైన్స్ నుంచి ఎమ్మార్పీకే భారీ మొత్తంలో మద్యం కొనుగోలు చేయడం మొదలెట్టారు. కొన్నాళ్లుగా చాప కింద నీరులా నడుస్తున్న ఈ వ్యవహారం ఇటీవల ముదురుపాకాన పడింది.

బెల్ట్‌షాప్ నిర్వాహకుల్లో అసంతృప్తి..

గ్రామాల్లో కిరాణా దుకాణాలు, పాన్‌షాపులు, బడ్డీకొట్లు బెల్ట్ షాపులుగా రూపాంతరం చెందాయి. స్థానికంగా ఉండే వారే ఎక్కువగా ఇక్కడ మద్యం తాగుతుంటారు. వారికి ప్లాస్టిక్ గ్లాసులు, మంచినీరు, పల్లీలు తదితర తినుబండారాలు ఉచితంగా ఇవ్వాల్సి వస్తోంది. దీంతో తమ లాభాలు తగ్గిపోతున్నాయనే అసంతృప్తి బెల్ట్‌షాపుల నిర్వాహకుల్లో ఉంది. బార్లు, వైన్స్, కౌంటర్ల వద్ద ప్లాస్టిక్ గ్లాస్‌కు కూడా డబ్బు వసూలు చేస్తారు. కానీ స్థానికంగా ఉండే పరిచయాలు, పరిస్థితుల కారణంగా తాము గ్లాసులకు బిల్లు వేయలేక నష్టపోతున్నామనేది బెల్ట్‌షాపుల వారి బాధ. అంతే కాదు.. అధిక ధరకు మద్యం అమ్ముతుంటే తమకు మందుబాబుల నుంచి ఇబ్బంది ఎదురవుతోందని అంటున్నారు. ఈ తరుణంలో క్వార్టర్ బాటిల్‌పై సిండికేట్ వారు అదనంగా వసూలు చేసే రూ.20లో తగ్గింపు ఇవ్వాలని కోరుతున్న తరుణంలో రేటు మరింతగా పెంచడం వివాదానికి బీజం వేసింది.

ఇల్లెందు ఘటనతో

మణుగూరు సిండికేట్‌తో విభేదించిన కొందరు బెల్ట్‌షాప్ నిర్వాహకులు మహబూబాబాద్ నుంచి భారీ ఎత్తున మద్యం తీసుకెళ్తున్నారనే విషయం ఇల్లెందు ఎక్సైజ్ పోలీసులకు ఉప్పందింది. దీంతో దారి కాచి భారీగా సరఫరా అవుతున్న మద్యాన్ని పట్టుకుని సీజ్ చేశారు. అయితే ఈ దాడి జరగడం వెనుక సిండికేట్ హస్తం ఉందని బెల్ట్‌షాపు నిర్వాహకులు ఆరోపిస్తున్నారు. గతంలో ఇల్లెందు ఎక్సైజ్ పరిధిలోనూ ఇలాంటి దాడులు అనేకం జరిగాయని వారు గుర్తు చేస్తున్నారు. బెల్ట్‌షాపుల్లో మద్యం అమ్మడం నేరమైనప్పుడు, సిండికేట్ రూపంలో ఎమ్మార్పీకి మద్యం అమ్మకపోవడం కూడా చట్టరీత్యా నేరమేనని అంటున్నారు. సిండికేట్ ఘనాపాటీల వ్యవహారాలను చూసీచూడనట్టుగా వదిలేయడం, చిల్లర దుకాణాలు, బడ్డీకొట్లలో నడుపుకునే బెల్ట్‌షాపులపై కక్ష కట్టినట్టుగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు. మరోవైపు సిండికేట్ అత్యాశ కారణంగా తమ జేబులకు చిల్లులు పడుతున్నాయని, దీనిపై ఎక్సైజ్ శాఖ దృష్టి పెట్టాలని మద్యం ప్రియులు కోరుతున్నారు. ఈ విషయమై ఇల్లెందు ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్‌ను వివరణ కోరగా తాము ఎక్కడా దాడులు చేయడం లేదని చెప్పారు.

బతుకులు ఆగం చేయొద్దు

- మాడవీధుల విస్తరణకు సహకరిస్తాం
- ప్రత్యామ్నాయం చూపండి.. పరిహారం ఇవ్వండి
- రామాలయ పరిసరాల చిరు వ్యాపారుల వినతి
- నేటి నుంచి ఇళ్లు తొలగించనున్న రెవెన్యూ అధికారులు



దుకాణంలోని సామగ్రిని తరలిస్తున్న వ్యాపారులు



రేకులు, ఫర్నిచర్‌ను భద్రం చేసుకుంటున్న వ్యాపారులు

భద్రాచలం: ‘దశాబ్దాల తరబడి రాముడిపైనే ఆధారపడి ఉంటున్నాం.. భక్తులు వస్తేనే మాకు పొట్ట నిండేది.. అయినా సరే రాముడిపై భక్తి, ఆలయాభివృద్ధి కోసం ఇళ్లు, దుకాణాలు ఖాళీ చేస్తున్నాం. ప్రభుత్వం హామీ ఇచ్చిన పరిహారం కూడా పూర్తిగా అందలేదు.. ప్రత్యామ్నాయ స్థలమూ చూపించలేదు.. ఇదేం అన్యాయం.. మా బతుకులు ఆగం కాకుండా చూడండి’ అంటూ నిర్వాసితులు గోడును వెల్లబోసుకుంటున్నారు.

మేమెక్కడ ఉండాలి..

భద్రాచలం, రామాలయం అభివృద్ధిలో భాగంగా ఆలయ పరిసరాల్లోని ఇళ్లు, దుకాణాలు తొలగించి మాడ వీధుల విస్తరణకు అధికారులు చర్యలు చేపట్టారు. నిర్వాసితులకు రెవెన్యూ అధికారులు ఇటీవల నష్టపరిహారం అందజేశారు. పరిహారం పూర్తిగా చెల్లించామని రెవెన్యూ అధికారులు చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో మాత్రం భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. శ్రీరామనవమికి ముందు రోజు హడావిడిగా చెక్కులు పంపిణీ చేశారని, అయితే ఆ రోజున మూడో వంతు పరిహారం మాత్రమే అందించారని నిర్వాసితులు అంటున్నారు. మిగిలిన మొత్తం కొద్ది రోజుల్లోనే ఇస్తామని, భూమికి బదులు భూమి అందిస్తామని చెప్పారని, కానీ ఇంతవరకూ మిగితా డబ్బు ఇవ్వక పోగా ప్రత్యామ్నాయం కూడా చూపలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఇళ్లు తొలగిస్తామని అంటున్నారని, మరి తామెక్కడ ఉండాలని ప్రశ్నిస్తున్నారు. ఇళ్లు, దుకాణాలు ఖాళీ చేయాలంటూ తమపై ఒత్తిడి చేస్తున్న అధికారులు.. ప్రత్యామ్నాయం చూపకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు.

స్పష్టత ఇవ్వని అధికారులు..

నిర్వాసితులకు భూమి అందజేసే విషయంలో రెవెన్యూ అధికారులు ఇంతవరకు స్పష్టత ఇవ్వలేదు. కానీ ‘ప్రసాద్’ పనుల్లో భాగంగా బ్రిడ్జి సెంటర్‌లో తొలగించిన ఆర్‌అండ్‌బీ స్థలాన్ని లాటరీ పద్ధతిలో కేటాయిస్తారనే ప్రచారం సాగింది. అయితే సుమారు రెండెకరాల ఈ స్థలం భవిష్యత్‌లో భద్రాచలం, రామాలయ అభివృద్ధికి ఉపయోగపడుతుందని, నిర్వాసితులకు పురుషోత్తపట్నం లేదంటే పట్టణంలో ఖాళీగా ఉన్న ఇతర ప్రభుత్వ స్థలాలను అప్పగించాలనే ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనిపై అధికారుల వద్ద ఎలాంటి స్పష్టత లేకపోవడంతో చిరు వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా ఖాళీ చేయాల్సిన భవనాల్లోని ఖరీదైన ఫర్నిచర్, కలపను మంగళవారం తరలించారు.

సగం పరిహారమే ఇచ్చినా ఖాళీ చేశాం



దుకాణాలు ఖాళీ చేయమని చెప్పారు. కానీ సగం పరిహారమే ఇచ్చారు. 50 ఏళ్లుగా ఇక్కడే మా మామయ్య, ఆ తర్వాత మేం వ్యాపారం చేసుకుంటున్నాం. పూర్తి పరిహారం అందజేయకపోవడంతో నడి రోడ్డుపై నిలబడాల్సి వచ్చింది. అభివృద్ధిపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పూర్తి నష్టపరిహారం అందజేసి మాకు న్యాయం చేయాలి.

– సింగరాల రజని

ప్రత్యామ్నాయం చూపండి..



60 సంవత్సరాలుగా ఆలయం పక్కనే ఉన్న మా సొంత స్థలంలో చిరు వ్యాపారం తరతరాలుగా చేసుకుంటున్నాం. వేరే చోట భూమి ఇచ్చి ఖాళీ చేయిస్తామన్నారు. కానీ ఇంత వరకు భూమి చూపించలేదు, పూర్తి పరిహారం ఇవ్వలేదు. ఇదేం లేకుండా ఖాళీ చేయించి మా బతుకులను ఆగమాగం చేస్తున్నారు. అటు ఉపాధి కోల్పోయి, ఇటు నీడను కోల్పోయి బాధ పడుతున్నాం.

– వేమిరెడ్డి సౌజన్య

గిరిజన మహిళా సమాఖ్యలకు ఇసుక ర్యాంప్‌లు

మైనింగ్ ఎండీ భవేష్ మిశ్రా



మాట్లాడుతున్న భవేష్‌మిశ్రా, పక్కన కలెక్టర్, పీఓ

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో పెసా చట్టం ప్రకారం గిరిజన మహిళా సమాఖ్యల ద్వారా ఇసుక ర్యాంపుల ఏర్పాటు, నిర్వహణకు అన్ని చర్యలు చేపట్టాలని మైనింగ్ ఎండీ భవేష్‌మిశ్రా అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన కలెక్టర్ జితేష్ వి పాటిల్, భద్రాచలం, ములుగు ఐటీడీఏ పీఓలు రాహుల్, చిత్రమిశ్రాతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదట జిల్లాలో ఇసుకర్యాంపుల వివరాలు, నిర్వహణపై కలెక్టర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం భవేష్ మిశ్రా మాట్లాడుతూ ఇసుకర్యాంపుల నిర్వహణకు అవసరమైన వాహనాలు, యంత్రపరికరాలు సమకూర్చుతామని, ఇసుకతో గిరిజన మహిళలకు మూడురెట్ల ఆదాయం పెరుగుతుందని చెప్పారు. భద్రాద్రి జిల్లాలో 8, ములుగు జిల్లాలో మూడు ఇసుక ర్యాంపుల ఏర్పాటుకు ఉత్సాహవంతమైన మహిళా సమాఖ్య సభ్యులను గుర్తించాలని సూచించారు. ప్రయోగాత్మకంగా ములుగు, భద్రాద్రి జిల్లాల్లో ఒక ఇసుక ర్యాంపును ప్రారంభించేలా సభ్యులకు శిక్షణ ఇవ్వాలన్నారు. గిరిజన మహిళలు సమర్థవంతంగా ఇసుక ర్యాంపుల నిర్వహణ చేపట్టేందుకు అన్ని విధాలా ప్రోత్సాహకాలు అందిస్తామని చెప్పారు. సమావేశంలో కొత్తగూడెం, భద్రాచలం ఆర్డీఓలు మధు, దామోదర్‌రావు, ప్రత్యేకాధికారి అశోక్‌కుమార్, తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శంకర్‌నాయక్, మైనింగ్ ఏడీ దినేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి నిత్యకల్యాణ వేడుక మంగళవారం నేత్రపర్వంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కాగా, మంగళవారాన్ని పురస్కరించుకుని అభయాంజనేయ స్వామి వారికి అభిషేకం, ప్రత్యేక పూజలు గావించారు.

సప్లిమెంటరీ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ పాటిల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ జితేష్ వి పాటిల్ తెలిపారు. ఐడీఓసీలో మంగళవారం నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు ఉదయం 9.30 – మధ్యాహ్నం 12.30గంటల మధ్య పరీక్షలు జరుగుతాయని, ఇందుకోసం కేంద్రాల్లో పటిష్ట ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. జిల్లాలోని ఐదు కేంద్రాల్లో జరిగే ఈ పరీక్షలకు 1,367 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఐదుగురు చీఫ్ సూపరింటెండెంట్లు, ఐదుగురు డిపార్టుమెంటల్ అధికారులు, రెండు ఫ్లయింగ్ స్క్వాడ్, ఐదు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలతో పాటు 50 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, వైద్య సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఈఓ వెంకటేశ్వరాచారి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పాటిల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వానాకాలంలో మలేరియా, ఫైలేరియా, మెదడువాపు, డెంగీ, చికున్‌గున్యా, టైఫాయిడ్, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులను అరికట్టవచ్చని అన్నారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సూచించారు. నీరు ఎక్కువగా నిల్వ ఉంటే దోమలు పెరుగుతాయని, ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి శుభ్రం చేయాలని సూచించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్, డీసీహెచ్‌ఎస్ రవినాయక్, జిల్లా మలేరియా అధికారి స్పందన, డీపీఓ చంద్రమౌళి, బీసీ, గిరిజన సంక్షేమాధికారులు ఇందిర, మణెమ్మ, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, నళిని, ఏడీఎంహెచ్‌ఓ జయలక్ష్మి పాల్గొన్నారు.

సౌకర్యాలు ఎలా ఉన్నాయ్..?

ఉపాధి కూలీలను ఆరా తీసిన కేంద్ర బృందం



డీర్‌పార్కు వద్ద జింకకు మేత అందిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

పాల్వంచరూరల్ : పని ప్రదేశాల్లో సరైన సౌకర్యాలు కల్పిస్తున్నారా.. కూలీలకు సరాసరి ఎంత వేతనం వస్తోంది.. పనిచేశాక ఎన్ని రోజులకు వేతనం అందుతోంది అంటూ కేంద్ర బృందం సభ్యులు రాకేష్‌కుమార్, వివేక్‌కుమార్ కేసరి ఆరా తీశారు. మండలంలోని జగన్నాథపురం, ప్రభాత్‌నగర్‌లో మంగళవారం పర్యటించిన సభ్యులు.. ఉపాధి కూలీలతో మాట్లాడి వివరాలు సేకరించారు. జగన్నాథపురంలో ఫాంపాండ్ పనులు, పామాయిల్ తోట, నర్సరీలు, ప్రభాత్‌నగర్‌లో ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద చేపట్టిన బ్రిడ్జి పనులను పరిశీలించారు.

కిన్నెరసాని సందర్శన..

పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని కేంద్ర బృందం సభ్యులు సందర్శించారు. డీర్ పార్కులోని దుప్పులను చూస్తుండగా ఒక జింక కంచె వద్దకు రాగా దానికి మేత అందించారు. ఆ తర్వాత డ్యామ్ పైకెళ్లి జలాశయాన్ని వీక్షించి లొకేషన్ చాలా అందంగా ఉందంటూ కితాబిచ్చారు. స్థానిక అధికారులతో కలిసి ఫొటోలు దిగారు. బృందం వెంట డీఆర్‌డీఓ విద్యాచందన, ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, ఏపీఓ రంగా, ఏపీఎం రాంబాబు, ఈసీలు రాజు, పుల్లయ్య, కార్యదర్శులు సాయిరాం, శ్రీనివాస్, శ్రీబాబు, రవి తదితరులు ఉన్నారు.

మొక్కల పెంపకంలో జాగ్రత్తలు పాటించాలి

ఇన్‌చార్జ్ డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్



రామాలయంలో కుటుంబసభ్యులతో డీఎఫ్‌ఓ

బూర్గంపాడు: నర్సరీల్లో మొక్కల పెంపకంపై జాగ్రత్తలు పాటించాలని ఇన్‌చార్జ్ డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్ సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని సండ్రెళ్ల రామాపురం అటవీ నర్సరీని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అడవుల నరికివేతతో తగ్గిన అడవి జాతి మొక్కలను తిరిగి పెంచేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం అడవుల సంరక్షణ, అటవీ ఉత్పత్తుల పెంపుపై ట్రెయినీ బీట్ ఆఫీసర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీఓ మసూద్, ఎఫ్‌ఆర్‌ఓ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రామయ్య దర్శనం..

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారిని ఇన్‌చార్జ్ డీఎఫ్‌ఓ సిద్ధార్థ విక్రమ్ సింగ్ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం దర్శించుకున్నారు. అర్చకులు స్వాగతం పలకగా ఆలయ అధికారులు స్వామివారి ప్రసాదం, జ్ఞాపికను అందజేశారు.ఎఫ్‌ఆర్‌ఓ సుజాత, ఆలయ పీఆర్‌ఓ సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

పరీక్షలకు సన్నద్ధం కావాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

పాల్వంచరూరల్ : పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని, బాగా రాసి ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. స్థానిక గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయినా.. నిరుత్సాహపడకుండా శ్రద్ధగా చదవాలని, ఉపాధ్యాయులు బోధించే పాఠాలు ఆసక్తిగా వినాలని సూచించారు. ఏమైనా సందేహాలుంటే సంబంధిత సబ్జెక్టు టీచర్‌ను అడిగి నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం ఆశ్రమ పాఠశాలలో నిర్మిస్తున్న మరుగుదొడ్లు, విద్యుత్ కనెక్షన్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్‌రాజు, హెచ్‌ఎం భద్రు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'సాక్షి' కార్యాలయంలో నిధి ఆప్‌కే నికట్



మాట్లాడుతున్న రెహానా సుల్తానా

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్లలోని 'సాక్షి' కార్యాలయంలో ఈఎస్ఐ, ఈపీఎఫ్ ఆధ్వర్యాన ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం 'నిధి ఆప్‌కే నికట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఎస్ఐ, ఈపీఎఫ్‌పై ఉద్యోగుల సందేహాలను అధికారులు నివృత్తి చేయడమే కాక ప్రయోజనాలను వివరించారు. జిల్లా నోడల్ ఆఫీసర్ బి.నాగులు, సూపర్‌వైజర్ కె.నాగేశ్వరరావు, ఈఎస్ఐ బ్రాంచ్ ఇన్‌చార్జ్ మేనేజర్ రెహానా సుల్తానా, ఉద్యోగి బి.కార్తీక్‌తో పాటు సాక్షి బ్రాంచ్ మేనేజర్ జి.మోహనకృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

చిన్న వయసు నుంచే ప్రోత్సహించాలి



పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ సతీశ్‌కుమార్

పాల్వంచ: చిన్న వయసు నుంచే పిల్లలను తల్లిదండ్రులు క్రీడలు ఆడేలా ప్రోత్సహించాలని పాల్వంచ డీఎస్పీ సతీశ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక శ్రీనివాసకాలనీ మినీ స్టేడియంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా సబ్ జూనియర్ డే అండ్ నైట్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీలను డీఎస్పీ ప్రారంభించారు. చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. జిల్లా క్రీడల అధికారి ఎం.పరంధామరెడ్డి మాట్లాడుతూ.. క్రీడలను ప్రోత్సహించేందుకు తమవంతు కృషి ఎప్పుడూ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ జి.యుగంధర్‌రెడ్డి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహీధర్, పి.నాగేందర్, మల్లికార్జున్, నాగరాజు, గిరిప్రసాద్, అక్బర్, ఎర్రయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.


తాగునీటిలో పురుగులు



తాగునీటిలో వచ్చిన పురుగులు, వ్యర్థాలు

అశ్వారావుపేటరూరల్: మున్సిపాలిటీ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటిలో మూడు రోజులుగా పురుగులు, ఇతరవ్యర్థాలు వస్తున్నట్లు స్థానికులు వాపోతున్నారు. అశ్వారావుపేట పట్టణ ప్రజలకు రోజూ స్థానిక పాత ప్రభుత్వ ఆస్పత్రిలో ఉన్న మిషన్ భగీరథ ట్యాంక్ ద్వారా ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేస్తుంటారు. కాగా, మూడు రోజులుగా స్థానిక వెలమబజారు, ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్ ప్రాంతం, కోనేరుబజారుతోపాటు పలు ఏరియాల్లో తాగునీటిలో పురుగులు, వాటి అవశేషాలతో పాటు వ్యర్థాలు వస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మంగళవారం తాగునీటిలో వచ్చిన పురుగులు, వాటి అవశేషాల ఫొటోలు, వీడియోలను తీసి స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేయడంతో వైరల్‌గా మారింది. వాటర్ ట్యాంకులను సకాలంలో శుభ్రం చేయకపోవడం, కొన్నిచోట్ల తాగునీటి పైపులు డ్రెయినేజీల్లో ఉండటంతో కలుషితం అవుతున్నట్లు పట్టణవాసులు చెబుతున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ



చోరీ జరిగిన ఇంట్లో ఆధారాలు సేకరిస్తున్న ఎస్ఐ, క్లూస్ టీం

సుజాతనగర్: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన వేపలగడ్డ గ్రామంలో సోమవారం వెలుగుచూసింది. ఎస్ఐ రమాదేవి కథనం మేరకు.. వేపలగడ్డకు చెందిన మల్లెల బాలచెన్నారెడ్డి తన ఇంటికి తాళం వేసి ఊరెళ్లాడు. గుర్తుతెలియని వ్యక్తులు తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి, బీరువాలోని 3.3 తులాల బంగారు వస్తువులతో పాటు రూ.60 వేల నగదును ఎత్తుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, క్లూస్ టీం ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,058

నిధులున్నా.. మరమ్మతులు సున్నా

- ప్రారంభం కాని తాలిపేరు కాల్వల పనులు
- రబీకి ముందే ఆరంభం కావాల్సి ఉన్నా వాయిదా..
- సాగునీరు విడుదల చేయాలని రైతులు పట్టుబట్టడమే కారణం
- మళ్లీ ఖరీఫ్ పూర్తయితేనే వీడనున్న గ్రహణం





కుదునూరు - దేవరాపల్లి మధ్యలో కూలిన అండర్ టన్నెల్ వద్ద ఇసుక బస్తాలు, (ఇన్‌సెట్) ఎడమ ప్రధాన కాల్వపై కుదునూరు - వీరాపురం మార్గంలో కృంగిన వంతెన

చర్ల: తాలిపేరు ప్రధాన కాల్వల మరమ్మతులకు పట్టిన గ్రహణం వీడడం లేదు. నాడు నిధులు లేక మరమ్మతులు చేపట్టకపోగా నేడు నిధులున్నా పనులు జరగడం లేదు. దీంతో ఆయకట్టు పరిధిలోని సాగు భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు అందుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలోని పెదమిడిసిలేరు వద్ద గల తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టు కింద ఏటా ఖరీఫ్‌లో అధికారికంగా 24,700 ఎకరాలు, అనధికారికంగా మరో 15వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. ఈ ప్రాజెక్టు కుడి ప్రధాన కాల్వ చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో విస్తరించి ఉండగా దీనికి 34 డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు ఉన్నాయి. వీటి కింద 21,100 ఎకరాల్లో అధికారికంగా, 12వేల ఎకరాల్లో అనధికారికంగా పంటలు సాగవుతున్నాయి. ఎడమ కాల్వ చర్ల మండలం దోశిళ్లపల్లి, భూముల్లంక, రైస్‌పేట, చర్ల, లింగాపురం, మొగళ్లపల్లి, జీపీపల్లి, చింతకుంట గ్రామాల మీదుగా విస్తరించి ఉండగా, 8 డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లు ఉన్నాయి. దీని కింద అధికారికంగా 3,600, అనధికారికంగా మరో 3 వేల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి.

ఏటా తాత్కాలికమే..

కాల్వలతో పాటు డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల మరమ్మతులకు ఏళ్లుగా నిధులు మంజూరుకాలేదు. గతేడాది ప్రాజెక్టు, ప్రధాన కాల్వలు, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల మరమ్మతులకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో గత జనవరిలోనే పనులు ప్రారంభించాల్సి ఉండగా రబీ పంటలకు సాగునీరు ఇవ్వాలని రైతులు పట్టుబట్టడంతో పనులు వాయిదా వేశారు. ఏప్రిల్ తర్వాత కూడా పనులు చేపట్టకపోవడంతో మళ్లీ సాగు సమయానికి పనులు పూర్తికావని కాంట్రాక్టర్లు స్పష్టం చేశారు. దీంతో ప్రధాన కాల్వల వంతెనలు, యూటీల నిర్మాణాల పనులు నిలిచిపోగా డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లకు సంబంధించిన మరమ్మతు పనులు మాత్రమే కొనసాగుతున్నాయి.

అవకాశం ఉన్నా..

తాలిపేరు ఎడమ ప్రధాన కాల్వపై పలుచోట్ల ఉన్న యూటీలు కృంగిపోయి సాగునీరు చివరి భూముల వరకు వెళ్లకపోవడంతో గత ఏడాది ఖరీఫ్‌లో ఇరిగేషన్ అధికారులు సిమెంట్ బస్తాలను ఏర్పాటు చేసి తాత్కాలిక మరమ్మతులు చేసి అతికష్టం మీద సాగునీటిని కాల్వ ద్వారా మళ్లించారు. ప్రస్తుతం అవి ధ్వంసం కావడంతో ఖరీఫ్ సీజన్‌లో సాగునీటి సరఫరాకష్టమే. ఏప్రిల్‌లో పనులు ప్రారంభించి జూన్ రెండో వారం నాటికి పూర్తి చేసే అవకాశం ఉన్నా అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు మండిపడుతునానరు. తాలిపేరు ప్రాజెక్టు, కాల్వలపై అధికారులు, ప్రభుత్వం ఎప్పుడూ నిర్లక్ష్యమే ప్రదర్శిస్తున్నట్లు రైతులు వాపోతున్నారు.

ముందుగా చేస్తే బాగుండేది..



ప్రధాన కాల్వకు సంబంధించి రబీసాగు పూర్తవ్వగానే పనులు ప్రారంభిస్తే బాగుండేది. గత ఏడాదే యూటీలు కూలిపోయి సాగునీరు అతికష్టం మీద పొలాలకు చేరింది. మళ్లీ యూటీలకు తాత్కాలిక మరమ్మతులు చేయాల్సిన పరిస్థితే ఉంది. అధికంగా వర్షాలు కురిస్తే ఇసుక బస్తాలు కూడా కొట్టుకుపోతాయి.

–కూరపాటి వీర్రాజు, రైతు, ఆర్.కొత్తగూడెం

సమయాభావంతోనే పనుల వాయిదా



సమయాభావం వల్ల ప్రధాన కాల్వకు సంబంధించి అండర్ టన్నెళ్ల మరమ్మతులు వాయిదా వేయాల్సి వచ్చింది. ఆ పనులు చేయాలంటే కనీసం రెండు నెలలు పడుతుంది. దీంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. డిస్ట్రిబ్యూటరీ కెనాళ్లకు సంబంధించిన మరమ్మతులు ప్రారంభించాం. అండర్ టన్నెళ్ల పనులూ చేపడతాం.

–ఎస్‌డీ అహ్మద్ జానీ, ఈఈ, ఇరిగేషన్

తెలుగు మాధుర్యాన్ని పిల్లలకు అందించండి



మాట్లాడుతున్న అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్

కొత్తగూడెంఅర్బన్: తెలుగు భాష మాధుర్యాన్ని పిల్లలకు అందించి, మాతృభాషపై మక్కువ పెంచాల్సిన బాధ్యత తెలుగు ఉపాధ్యాయులపై ఉందని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి ఎ.నాగరాజశేఖర్ అన్నారు. జిల్లాలోని తెలుగు ఉపాధ్యాయులకు కొత్తగూడెంలోని జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో జరుగుతున్న చివరి విడత వృత్యంతర శిక్షణ శిబిరాన్ని సందర్శించిన ఆయన మాట్లాడారు. ప్రస్తుత ఆంగ్ల మాధ్యమ ఒరవడిలో తెలుగు భాష కనుమరుగయ్యే ప్రమాదం ఉందని, దీనిని సమర్థవంతంగా ఎదుర్కొని, కథలు రాయటం, కథలు చెప్పటం, పద్యాలు రాయటం, పద్య పఠనం, ఇంకా అనేక ప్రక్రియలను పరిచయం చేసి పిల్లల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయాల్సిన బాధ్యత తెలుగు ఉపాధ్యాయులదేనని గుర్తు చేశారు. కేవలం పబ్లిక్ పరీక్షల్లో పిల్లలు ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యంగా పనిచేయకుండా తెలుగు సాహిత్యం, తెలుగుకు సంబంధించిన వివిధ గ్రంథాలను చదివేటట్లుగా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షణ కేంద్ర ఇన్‌చార్జ్ బి.నీరజ, రాష్ట్ర పరిశీలకులు మడత భాస్కర్‌గౌడ్, డీఆర్పీలు రంగపురి కృష్ణార్జున్‌రావు, బండి రామచందర్‌రావు, సత్య సాయిరాం, భూక్య కర్ణ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ ఆత్మహత్య



దుర్గాప్రసాద్‌పాసీ (ఫైల్)

ఇల్లెందు: పట్టణంలోని 15వ నంబర్‌బస్తీవాసి, ఆటోడ్రైవర్ దుర్గాప్రసాద్ (45) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంగళవారం 8వ నంబర్ చెరువు సమీపంలో కూల్‌డ్రింక్‌లో పురుగులమందు కలుపుకుని తాగి మృతి చెందగా సాయంత్రం మేకల కాపరులు చూసి సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వెళ్లి చూడగా దుర్గాప్రసాద్ మృతి చెంది ఉన్నాడు. మృతుడికి భార్య మీనాపాసీ కుమారి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఆటో నడుపుతూ జీవనం సాగించే ఆయ న ఆరు నెలల కాలంలో రెండు దఫాలు యాక్సిడెంట్‌లో గాయపడ్డాడు. తలలో రక్తం గడ్డకట్టగా ఆపరేషన్ అయినట్లు బంధువులు తెలిపారు. మానసికంగా ఇబ్బంది పడుతున్న ఆయన కుటుంబసభ్యుల సమాధుల వద్దకు చేరి, అక్కడే ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసింది.

మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ కన్నుమూత

- ఉపాధ్యాయ వృత్తి నుంచి ఎమ్మెల్యే వరకు ప్రస్థానం
- తొలినాళ్లలో సర్పంచ్, ఎంపీటీసీగా కూడా విజయం
- సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్ సహా పలువురి సంతాపం



2014 ఎన్నికల్లో గెలిచాక పొంగులేటి శ్రీనివాసరెడ్డితో మదన్‌లాల్

వైరా/రఘునాథపాలెం: వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్(63) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను కుటుంబీకులు హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో ఈనెల 23న చేర్పించారు. అక్కడ చికిత్స చేయిస్తుండగానే గుండెపోటు రావడంతో కన్నుమూశారు. ఆయన స్వగ్రామం రఘునాథపాలెం మండలం ఈర్లపుడి కాగా మదన్‌లాల్‌కు భార్య మంజుల, కుమారుడు మృగేందర్‌లాల్, కూతురు మనీషాలక్ష్మి ఉన్నారు. కుమారుడు తమిళనాడు(కోయంబత్తూరు) రాష్ట్ర జీఎస్టీ కమిషనర్‌గా, కోడలు శ్వేత తమిళనాడు కేడర్‌లో జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మూడు నెలల క్రితమే ఆయన సోదరుడు, పోలీస్ శిక్షణా కేంద్రం ఏసీపీ జవహర్‌లాల్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఇప్పుడు మదన్‌లాల్ మృతితో వారి కుటుంబంలో విషాదం నెలకొంది.

ఉపాధ్యాయుడి నుంచి ఎమ్మెల్యే దాకా..

మదన్‌లాల్ ఈర్లపూడిలోని సామాన్య కుటుంబంలో జన్మించారు. 11 మంది సంతానంలో మదన్‌లాల్ మూడో వ్యక్తి కాగా, ప్రాథమిక విద్య డోర్నకల్ మండలం బలపాలలో, డిగ్రీ ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాలలో పూర్తిచేశారు. కళాశాల రోజుల్లో పీడీఎస్‌యూలో పనిచేసిన ఆయన.. 1989లో కామేపల్లి మండలం అబ్బాస్‌పురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేశారు. కబడ్డీలో ప్రావీణ్యం ఉండడంతో అదే ఏడాది ఎస్ఐ పోస్టుకు ఎంపికైనా కేసుల కారణంగా ఉద్యోగం దక్కలేదు. ఆ తర్వాత రాజకీయాలపై ఆసక్తితో ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి 1996 – 2001 వరకు ఈర్లపూడి సర్పంచ్‌గా పనిచేశారు. 2001 – 2006 వరకు ఆయన భార్య మంజుల సర్పంచ్‌గా కొనసాగగా, తిరిగి 2006లో మదన్‌లాల్ రెండోసారి సర్పంచ్‌గా, ఆపై కాంగ్రెస్ తరఫున ఎంపీటీసీగా విజయం సాధించారు. 2004లో ఇల్లెందు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ టికెట్ ఆశించినా దక్కలేదు. 2009లో ఏర్పాటైన వైరా(ఎస్టీ) నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించినా ఫలితం లేక ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగి 5వేల పైచిలుకు ఓట్లు సాధించారు. దివంగత సీఎం వైఎస్‌పై అభిమానంతో 2014లో నాటి ఎంపీ, ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడిగా వైఎస్సార్‌సీపీలో చేరి, వైరా నుంచి సీపీఎం మద్దతుతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. కానీ ఏడాది తిరగకుండానే బీఆర్ఎస్(టీఆర్ఎస్)లో చేరగా, 2018, 2023 ఎన్నికల్లోనూ పోటీ చేసినా విజయం దక్కలేదు. ప్రస్తుతం బీఆర్ఎస్ వైరా నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు.

కేసీఆర్ సహా పలువురి నివాళి

మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మృతదేహాన్ని ఖమ్మం కవిరాజ్‌నగర్‌లోని నివాసగృహానికి తీసుకొచ్చారు. ఈమేరకు మాజీ సీఎం కేసీఆర్ మదన్‌లాల్ కుమారుడు మృగేందర్‌లాల్‌కు ఫోన్ చేసి ఓదార్చారు. అలాగే, సీఎం కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. ఇక ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, కొండబాల తదితరులు మదన్‌లాల్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు గడిపల్లి కవిత, బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్, రాంపూడి రోశయ్య, పగడాల మంజుల, కూరాకుల నాగభూషణం, లింగాల కమలరాజు, గుండాల కృష్ణ, నెల్లూరి కోటేశ్వరరావు, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, పగడాల నాగరాజు, మందడపు సుబ్బారావు, నున్నా రవికుమార్, బాగం హేమంతురావు, దండి సురేష్, యర్రా బాబు తదితరులు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి సైతం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. కాగా, మదన్‌లాల్ అంత్యక్రియలను బుధవారం స్వగ్రామమైన ఈర్లపుడిలో నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబీకులు వెల్లడించారు.

నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



నిందితుడు, నాటుసారాను చూపుతున్న అధికారులు

భద్రాచలంఅర్బన్: ద్విచక్రవాహనంపై నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని బ్రిడ్జి సెంటర్ వద్ద మంగళవారం జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. ఏపీలోని ఎటపాక మండలం గుండువారిగూడెం గ్రామానికి చెందిన నితిన్ తన ద్విచక్రవాహనంపై 23 లీటర్ల నాటుసారాను బూర్గంపాడు మండలం సారపాకకు తరలిస్తుండగా పట్టుకున్నామని ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. నితిన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని, నాటుసారా, గంజాయి రవాణాకు సంబంధించిన సమాచారాన్ని టోల్ ఫ్రీ నంబర్ 18004252523కు అందించాలని సీఐ పేర్కొన్నారు. దాడుల్లో కరీం, బాలు, సుధీర్, హనుమంతరావు, హరీశ్, ఉపేందర్ పాల్గొన్నారు.

గంజాయిపై డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు



తనిఖీలు చేపడుతున్న ఎస్ఐ మధుప్రసాద్

అశ్వాపురం: గంజాయి నియంత్రణ చర్యల్లో భాగంగా మంగళవారం నార్కోటిక్ గ్రేసీడాగ్‌తో ఎస్ఐమధుప్రసాద్ ఆధ్వర్యం లో పోలీసులు మండలంలోని చవిటిగూడెంలో అనుమానితుల ఇళ్లు, పాదలు, ఖాళీస్థలాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మధుప్రసాద్ మాట్లాడుతూ.. యువత, విద్యార్థులు గంజాయి లాంటి మత్తు పదార్థాలకు బానిసై జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. మండలంలో గంజాయి నిర్మూలనలో ప్రజలు, యువత కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

గంజాయి పట్టివేత?

జూలూరుపాడు: అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గంజాయిని మంగళవారం స్థానిక పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. భద్రాచలం నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీలో గంజాయి తరలిస్తుండగా జూలూరుపాడు మండల పరిధిలో వాహనాలు తనిఖీ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. లారీలో భారీ మొత్తంలోనే గంజాయి దొరికినట్లు తెలిసినా.. పోలీసులు వివరాలు వెల్లడించేందుకు విముఖత వ్యక్తం చేశారు.

ఇరు వర్గాలపై కేసు నమోదు

దమ్మపేట: భూ వివాదం విషయంలో రెండు వర్గాల మధ్య పరస్పర దాడులు జరగగా.. ఓ వర్గంపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు, మరో వర్గంపై దాడి కేసు నమోదైంది. పోలీసులు మంగళవారం వివరాలు వెల్లడించారు. మండలంలోని అఖినేపల్లి శివారులోని పామాయిల్ తోట తమదే అంటూ దమ్మపేటకు చెందిన కునుసోతు వెంకటేశ్వరరావు, పద్మ దంపతులు పామాయిల్ ఆకులను కోయడం ప్రారంభించారు. అదే సమయంలో తోటలోకి దమ్మపేటకు చెందిన మారిశెట్టి రామారావు, శ్రీనివాసరావు సోదరులు వచ్చి తోట తమదే అంటూ వెంకటేశ్వరరావు, పద్మను అడ్డుకున్నారు. ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

ముక్కు నేలకు రాస్తా..

- ఇప్పుడున్న ఎమ్మెల్యేను ఒక్క పట్టా ఇప్పించమనండి..
- మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సవాల్..



రికార్డులను పరిశీలిస్తున్న ఎఫ్ఆర్ఓ ఉపేందర్, మాజీ ఎమ్మెల్యే కాంతారావు

మణుగూరురూరల్: ఆనాడు తాను ఎంతో శ్రమించి, పోడు పట్టాలిప్పిచ్చానని, ఇప్పుడున్న ఎమ్మెల్యే ఒక్క పట్టా ఇప్పించినా ముక్కు నేలకు రాస్తానని పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు సవాల్ విసిరారు. మంగళవారం మండలంలోని కట్టుమల్లారం గ్రామ పంచాయతీలో కొందరు గిరిజనులు ట్రాక్టర్లతో అటవీ ప్రాంతంలో దున్నుతుండగా మణుగూరు ఫారెస్ట్ అధికారులు అడ్డుకున్న ఘటన మంగళవారం చోటుచేసుకుంది. అటవీ ప్రాంతంలో సాగు పనులు చేస్తున్నట్లు తెలుసుకున్న ఎఫ్ఆర్ఓ ఉపేందర్, ఇతర అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని నిబంధనలను అతిక్రమించి అడవిని ఆక్రమించి పోడు సాగు చేయొద్దని సూచించారు. దీంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ వర్గాలకు చెందిన గిరిజన కుటుంబాల మధ్య, ఫారెస్ట్ అధికారుల మధ్య వాగ్వాదం చోటుచేసుంది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఘటనా ప్రాంతానికి చేరుకుని పరిష్కరించేందుకు ప్రయత్నించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఆనాడు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం పోడు భూమి రాలేదంటూ కాంగ్రెస్ వర్గీయులు కాంతారావును ప్రశ్నించారు. ఆనాడు అధికారులు చేసిన సర్వేలో ఏదైనా పొరపాట్లు దొర్లి ఉండవచ్చని.. ఆ రికార్డులను తెప్పిస్తే న్యాయం చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఎంత నచ్చజెప్పిన సదరు గిరిజనులు వినకుండా భీష్మించడంతో.. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోనే ఉందని, స్థానిక పాలకులతో సమస్యను పరిష్కరించుకోకుండా ఇలా అటవీ భూమిని ఆక్రమించి మొక్కలు నాటడం సరికాదని సూచించారు. ఆనాడు తాను ఎంతో శ్రమించి గిరిజన పోడు సాగుదారులకు పట్టాలు ఇప్పించానని, కాంగ్రెస్ ఎమ్మెల్యేకు దమ్ముంటే ఒక్కరికి పట్టా ఇప్పించినా.. ఫారెస్ట్, రెవెన్యూ, పోలీస్ అధికారుల సమక్షంలో ఈ ప్రాంతంలో ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు. సమస్యను పెద్దది చేసే చర్యలు మానుకుని న్యాయ పరిష్కారానికి సహకరించాలని హితవు పలికారు.

తీర్థయాత్రలకు వెళ్తారా..?!

- ఐఆర్‌టీసీ ఆధ్వర్యాన రెండు ప్రత్యేక రైళ్లు
- ఖమ్మం మీదుగా వెళ్లనున్న ఒక రైలు

కొత్తగూడెంఅర్బన్: తీర్థయాత్రలకు వెళ్లే వారి సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ జాయింట్ జనరల్ మేనేజర్ డీఎస్‌జీపీ కిశోర్ వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం జూన్ 14 నుంచి జూలై 13వ తేదీ వరకు రెండు ప్యాకేజీలుగా హైదరాబాద్ నుంచి ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

మొదటి ప్యాకేజీ – గంగా రామాయణ పుణ్యక్షేత్ర యాత్ర

ఈ యాత్రలో (కాశీ)వారణాసి, అయోధ్య, నైమిశారణ్య, ప్రయాగ్‌రాజ్, శృంగవర్పూర్ ప్రాంతాల సందర్శన ఉంటుంది. జూన్ 14వ తేదీన ప్రారంభమై 22వ తేదీ వరకు కొనసాగే ఈ యాత్రలో ఒక్కొక్కరికి సాధారణ టికెట్ రూ.16,200, 3ఏసీ ధర రూ.26,500, 2ఏసీ ధర రూ.35 వేలుగా నిర్ణయించారు. ఈ రైలు సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, పలాస, బరంపూర్, భువనేశ్వర్ మీదుగా సాగుతుంది.

రెండో ప్యాకేజీ– ఐదు జ్యోతిర్లింగాల యాత్ర

ఈ ప్యాకేజీలో మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీంశంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా, మోవ్, నాగ్పూర్ ప్రాంతాలు సందర్శించవచ్చు. జూలై 5వ తేదీన మొదలయ్యే యాత్ర 13వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇందులో ఒక్కొక్కరికి సాధారణ టికెట్ రూ.14,700, 3ఏసీ రూ.22,900, 2ఏసీ ధర రూ.29,900గా నిర్ణయించారు. ఈ రైలు సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, నాందేడ్, ముద్‌ఖేడ్, పూర్ణ మీదుగా వెళ్తుంది.

ఇవీ సౌకర్యాలు

తీర్థయాత్రల కోసం ఏర్పాటు చేస్తున్న రైళ్లలో ప్రయాణించే వారికి హోటల్, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం, వాటర్ బాటిల్, టూర్ ఎస్కార్ట్ సేవలు ఎలాంటి అదనపు సేవలు లేకుండా అందుతాయి. అలాగే, ప్రయాణ బీమా ఉంటుంది. రైల్వే స్టేషన్ నుంచి ఆలయాలకు ప్రయాణం ఉచితంగా ఏర్పాటు చేస్తారు. ప్రతీ రైలులో 718 మంది ప్రయాణికులకు అవకాశం కల్పిస్తూ, ప్రతీ 70 మందికి ఇద్దరు కోఆర్డినేటర్లను నియమిస్తారు. అలాగే, ప్రతీ కోచ్‌కు ఒక సెక్యూరిటీ గార్డ్, రైలులో సీసీ కెమెరాలతో భద్రత ఉంటుంది. టికెట్ల బుకింగ్ కోసం 97013 60701, 92810 30712, 92814 95845, 92810 30749, 92810 30750 నంబర్లలో సంప్రదించవచ్చు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

పాల్వంచరూరల్: ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఓ వ్యక్తిపై స్థానిక పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. మండలంలోని కేశవాపురం గ్రామంలో మంగళవారం లింగంపల్లి సతీశ్ తన ఇంటి ముందు నుంచి మురుగునీరు ప్రవహించడం వల్ల దుర్వాసన, దోమలు పెరిగి ఇబ్బంది కలుగుతోందని గ్రామకార్యదర్శితోపాటు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇది తెలుసుకున్న ఇంటి పక్కనే ఉంటున్న గంధం నర్సింహారావు సతీశ్‌పై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు దాడి చేసిన నర్సింహారావుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేశ్ తెలిపారు.